క్లుప్తంగా

వైభవంగా పునర్వసు కల్యాణం


కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

దుమ్ముగూడెం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో పునర్వసు నక్షత్ర సందర్భంగా మంగళవారం స్వామివారికి మాస కల్యాణం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ విగ్రహాలను మండపంలోకి తీసుకొచ్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, యజ్ఞోపవీత ధారణ, స్వామి వారి అమ్మవారి ప్రవర్లు, మధుపర్కాలు, మహా సంకల్పం మంగళాష్టకాలు, జీలకర్ర బెల్లం, మాంగళ్య పూజ మాంగళ్య ధారణ మంగళహారతి, మంత్రపుష్పం చేపట్టి కళ్యాణతంతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్, ఆలయ ఉప ప్రధానఅర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజన్, మదన్మోహనాచార్యులు, వెంకటాచార్యులు, వేదపండితులు నరసింహాచార్యులు ఆలయ సిబ్బంది శివ, రాము ఉన్నారు.

చేతిపంపు ఏర్పాటు


గొత్తికోయగుంపులో ఏర్పాటుచేసిన పంపు

ములకలపల్లి: మండలపరిధిలోని వలస ఆదివాసీ గ్రామం కొర్రాజులగుట్టలో దాహార్తిని తీర్చేందుకు అధికారులు శనివారం చేతిపంపు ఏర్పాటు చేశారు. పూసుగూడెం జీపీ పరిధిలోని ఈ గొత్తికోయగుంపులో స్థానిక ఆదివాసీలు సమీపంలోని వాగులు, చెలమల నుండి నీళ్లు తెచ్చుకుంటూ అవసరాలు తీర్చుకుంటున్నారు. ఈ క్రమంలో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశాల మేరకు పంచాయతీ ఆధ్వర్యంలో చేతిపంపు ఏర్పాటు చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కందకాలు అడ్డగింత...

అశ్వాపురం: మండల కేంద్రంలో అశ్వాపురం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మాలోత్ బాబురావు కొమ్ముగూడెం అటవీ ప్రాంతంలో శుక్రవారం రాత్రి కందకాలు తవ్వుతుండగా గ్రామానికి చెందిన పూనెం కోటయ్య కందకాలను అడ్డుకున్నాడు. విధులకు ఆటంకం కలిగించి తనపై దాడి చేశాడని కోటయ్యపై బాబురావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ అశోక్‌రెడ్డి కోటయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ

మణుగూరు రూరల్: టీడీపీలో సభ్యత్వం పొందిన కార్యకర్తలకు శనివారం ఆ పార్టీ నాయకులు సభ్యత్వ నమోదు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వట్టం నారాయణదొర, వాసిరెడ్డి చలపతిరావు, పాగాకు వెంకటేశ్వర్లు, యార్లగడ్డ రాజా, ఎలమాటి పూర్ణచందర్‌రావు, బచ్చల సుమేష్ ఉన్నారు.

రేపు సింగరేణి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

మణుగూరు టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని విఠల్‌రావు నగర్‌లో సింగరేణి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏరియా అధికార ప్రతినిధి రమేశ్ శనివారం తెలిపారు. సింగరేణి సామాజిక బాధ్యతతో ఉదయం నుంచి నిర్వహించే ఈ వైద్యశిబిరం భూ నిర్వాసితులకు, ప్రభావిత గ్రామాలకు ఉచిత వైద్యశిబిరం స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహిస్తోందన్నారు.

బాధితులకు అండగా ఉంటాం..


పరామర్శిస్తున్న నామా

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ) : బాధితులకు అండగా ఉంటామని మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని మర్రిగూడెం, బుచ్చన్నగూడెం గ్రామాల్లో శనివారం ఆయన మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లుతో కలిసి శనివారం పర్యటించారు. ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ సున్నం నాగమణి తదితరులు పాల్గొన్నారు.



'మల్లెపూవు వంటి స్వచ్ఛమైన మనసు' అంటూ స్వచ్ఛతకు ప్రతీకగా ఈ సుగంధ పుష్పాలను వర్ణిస్తారు. వేసవిలో లభించే ఈ మల్లెపూలంటే మగువలకు ఎంతో మక్కువ. చిన్నారుల మొదలు వృద్ధుల వరకూ ఈ పూలను ఇష్టపడని వారుండరు. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల్లో మల్లెపూలకు పెద్దపీట వేస్తారు. మహిళలు సిగలో ధరించి, తమ అందాన్ని మరింత రెట్టింపు చేసుకుంటారంటే అతిశయోక్తికాదు. ముస్లింల వివాహాల్లో మల్లెపూల దండలకు ప్రత్యేక స్థానం ఉంటుంది. వరుడి ముఖాన్ని పూర్తిగా మల్లెపూలతో అలంకరించే విషయం అందరికీ తెలిసిందే.

– ములకలపల్లి

ఇది మల్లెల వేళయనీ..



వేసవి ప్రత్యేకం.. మల్లెపూలు
- భగభగ ఎండల్లోనూ సువాసన వెదజల్లుతూ..
- మగువల మది దోచే తెల్లని పుష్పాలు


ఓ ఇంటి ఆవరణలోని మల్లెతోట

మండే ఎండల్లో ఎంతో హాయిగా ..

మార్చి మాసం మొదలు జూన్ తొలివారం వరకూ భానుడి భగభగలకు ప్రజలు అల్లాడిపోవాల్సిందే. అయితే ఇలాంటి ఎండల్లోనూ తెల్లనిమల్లెలు సువాసన వెదజల్లుతూ విరబూస్తూ ఉంటాయి. ఏడాది మొత్తం అక్కడక్కగా కనిపించినా, ప్రధానంగా మార్చి, ఏప్రిల్, మే నెలాఖరు వరకూ మల్లెల పరిమళాలు వెదజల్లుతూనే ఉంటాయి. పట్టణాల్లో మూర రూ.30 నుంచి, రూ.50 వరకూ విక్రయిస్తుండగా, పల్లెల్లో మాత్రం వంద మల్లెలు రూ.10 నుండి రూ.15 వరకు విక్రయిస్తున్నారు. కిలోమల్లెలు బహిరంగ మార్కెట్ రూ.400 నుండి 500 వరకూ ధర పలుకుతోంది. వేసవిలోనూ మల్లెల సువాసన మగువల మది దోచేస్తాయని అంతా చెబుతారు.

మల్లెపూలంటే ఇష్టం



మల్లెపూలంటే ఎంతో ఇష్టం. మండు వేసవిలోనూ మల్లెలు సుగంధాల వాన కురిపిస్తాయి. ఈ పూలంటే ఇష్టపడని మగువలు దాదాపుగా ఉండరనే చెప్పాలి. సీజనల్‌గా మాత్రమే వచ్చే పూలు కావడంతో అందరికీ ఇవంటే ఇష్టం.

– బొమ్మకంటి నాగలక్ష్మి, గృహిణి, ములకలపల్లి

పెంచాలంటే వ్యయ ప్రయాసే..

మల్లెజాతుల్లోనూ పలురకాలు ఉన్నాయి. పందిరిమల్లె, బొండుమల్లె, తుప్పమల్లె, దొంతర మల్లె, కాగడమల్లె, సెంటుమల్లె వంటి రకాలున్నాయి. వీటితోపాటు కాగడమల్లె, విరజాజి వంటి మల్లెలూ ఉన్నాయి. ఐతే బొండుమల్లె, పందిరిమల్లె ఎక్కువగా అందుబాటులో ఉంటుంది. మల్లెతోటల సాగు కాస్త ఖర్చుతో కూడుకున్న పనే. ఏడాదికి మూడు, నాలుగు నెలలు మాత్రమే పూలు ఇచ్చినా, సంవత్సరం మొత్తం సస్యరక్షణ చేపట్టాల్సిందే. తోటల్లో కలుపు తొలగించడం, పైపాటు చేయడం, మొక్కల చుట్టూ పాదులు చేయడం, ఏడాదిపాటు నీరు అందిచడం తదితర పనులు క్రమం తప్పకుండా చేయాలి. సీజన్‌కు ముందు చెట్ల ఆకులన్నీ తొలగిస్తే, లేత చిగుర్లతోపాటు పూలగుత్తులు అధికంగా వచ్చే వీలుంటుంది. పశువుల పేడ వంటి సేంద్రియ ఎరువులు వాడితే, చక్కటి పూల దిగుబడి సాధించవచ్చు.


మల్లెపూలు కోస్తున్న చిన్నారి

సండే స్పెషల్

కూల్.. కూల్‌గా..



విక్రయించడానికి సిద్ధంగా ఉన్న కూలర్లు

ఎండవేడితో కూలర్లకు పెరిగిన డిమాండ్

దుమ్ముగూడెం: ఏజెన్సీలో గతంలో అడవులు దట్టంగా ఉండటంతో వేసవిలో వాతవరణం కొంత చల్లగా ఉండేది. ప్రస్తుతం అడవులు అంతామాయం కావడంతో ఏజెన్సీ ప్రజలకు సైతం ఎండ వేడిమి తప్పడం లేదు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు కూలర్లు, ఏసీలను ఆశ్రయిస్తున్నారు. ఏజెన్సీలో ఎక్కువగా పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా ఉండటంతో కూలర్లకు మొగ్గుచూపుతున్నారు. ఇప్పటికే కూలర్ల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. వారి వారి స్థోమతకు తగ్గట్టుగా కూలర్లను కొంటున్నారు. ఫైబర్ కూలర్ల కంటే ఐరన్ కూలర్లు కొంచెం ఎక్కువ గాలిని ఇస్తుండటంతో వాటిని కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

పట్టణాల నుండి దిగుమతి..

మండలంలోని కూలర్ల విక్రయదారులు పట్టణాల నుండి కూలర్లను దిగుమతి చేసుకుని ప్రజలకు అందుబాటు ధరలో విక్రయిస్తుంటారు. కంపెనీకి చెందిన కూలర్లు సైతం అందుబాటులో ఉండటంతో ఇన్‌స్టాల్‌మెంట్ ప్రాతిపదికన వాటిని కొనుగోలు చేస్తున్నారు. గతంలో కూలర్లు కావాలంటే భద్రాచలం వెళ్లాల్సిన పరిస్థితులు ఉండేవి ఇప్పుడు లక్ష్మీనగరం, ములకపాడు గ్రామాలలో కూలర్లను విక్రయిస్తుండటంతో ప్రజలకు అందుబాటులో ఉన్నాయి.

వివిధ మోడళ్లు..



ఈ వేసవిలో కూలర్ల విక్రయం మంచిగానే సాగుతుంది. గతంతో పోలిస్తే కొంచెం తక్కువ విక్రయాలు జరుగుతున్నప్పటికీ ప్రజలు కొంటున్నారు. వారికి వాల్సిన వివిధ మోడళ్లను అందుబాటులో ఉంచి విక్రయిస్తున్నాం.

– పిట్టా సురేష్, కూలర్ల విక్రయదారు, లక్ష్మీనగరం

పేదల సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. 105 మంది లబ్ధిదారులకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి గూడు లేనివారికి నీడ కల్పిస్తామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్‌పై రాయితీ, రైతు రుణమాఫీ, సన్న ధాన్యానికి బోనస్ వంటి పథకాలతో పేదలకు ప్రభుత్వం భరోసా కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం

ప్రజారంజక పాలనలో విఫలం



మాట్లాడుతున్న గుమ్మడి నరసయ్య

దమ్మపేట: ప్రజారంజక పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మాస్‌లైన్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం జాతీయ కన్వీనర్ కెచ్చెల రంగారెడ్డితో కలిసి మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశపెట్టిన జాతీయ మార్కెటింగ్ విధానాలు కార్పొరేట్, పెట్టుబడి దారులకు అనుకూలంగా రైతులకు వ్యతిరేకంగా ఉన్నాయన్నారు. వలసలను నిరోధించడానికి ఉపాధి హామీ కూలీలకు కనీసంగా రోజుకు రూ.600లు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25, 26 తేదీల్లో దమ్మపేటలో జరగనున్న అఖిల భారత రైతు సంఘం జిల్లా మహాసభలకు అధిక సంఖ్యలో జరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.రవి, జిల్లా అధ్యక్షులు బుర్ర వెంకన్న, కల్లూరి కిషోర్, అమర్లపూడి రాము, ముద్దా భిక్షం పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి


జెండా ఆవిష్కరిస్తున్న త్యాగరాజన్

మణుగూరు టౌన్: కార్మికుల సంక్షేమానికి, కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ కృషి చేస్తుందని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్ అన్నారు. శనివారం ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మణుగూరులోని వివిధ గనులు డిపార్ట్‌మెంట్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ మేరకు యూనియన్ కృషిని ఘనతను కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నాయకులు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం కేసీహెచ్‌పీ, ఏరియా వర్క్‌షాప్, కేపీయూజీ, మణుగూరు ఓసీలలో ఆయా ఫిట్ సెక్రటరీలు శ్యామ్‌వర్మ, జంపాల శ్రీనివాస్, పాదిల రామకృష్ణ, గొప్ప సుధాకర్‌ల ఆధ్వర్యంలో జెండాలను ఏరియా వైస్ ప్రెసిడెంట్ కృష్ణంరాజుతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీను, జయరాజ్, అజహర్ ఖాన్, అశోక్, మల్లికార్జున్, మల్లేశ్, రామారావు, దశరథ్, సంతోష్, చరణ్, అభిలాష్, అక్రమ్, భాగం రవి, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్, శంకర్, అనిల్, శ్రీను, జయరాం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే వెంకట్రావ్


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావ్

భద్రాచలంటౌన్: ప్రభుత్వ పథకాలతో లబ్ధిపొందిన వారు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. వివిధ కారాణాలతో ఆస్పత్రుల్లో చేరి వైద్య ఖర్చులకు సీఎం రిలీఫ్‌ఫండ్‌కు అభ్యర్థన పెట్టుకున్న వారికి ఆర్థికసాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటం

దమ్మపేట: ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాటాలు చేస్తూ, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి షేక్ నాగుల్ మీరా అన్నారు. శనివారం అశ్వారావుపేటలో నియోజకవర్గ స్థాయి ఏఐవైఎఫ్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతీ నెల మండల స్థాయి సమావేశాలను నిర్వహించి, స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించాలన్నారు. అనంతరం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు ఏఐవైఎఫ్ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా ముచ్చర్ల వెంకటేష్, కార్యదర్శిగా సయ్యద్ జాకీర్, అశ్వారావుపేట అధ్యక్షుడిగా కలపాల రమేష్, కార్యదర్శిగా పుల్లగిరి సాయిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సయ్యద్ సలీం, గన్నిన రామకృష్ణ, విజయ్‌కాంత్, సుంకిపాక ధర్మ, అనుముల సాయి తదితరులు పాల్గొన్నారు.

రామయ్య సేవలో మాజీ ఎమ్మెల్యే

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారిని వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమించి వ్యాపారాలు చేయొద్దు

మణుగూరు రూరల్: పట్టణ ప్రధాన రహదారిని ఆక్రమించి వ్యాపారాలు చేయొద్దని మణుగూరు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ వ్యాపారస్తులకు సూచించారు. శనివారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో మున్సిపాలిటీ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, తహసీల్దార్ ఇమ్మానుయేల్, డీఎస్పీ వి.రవీందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమన మాట్లాడుతూ.. ప్రధాన రహదారిని, డ్రైయినేజీని ఆక్రమిస్తూ వ్యాపారస్తులు, చిరువ్యాపారులు తమ వ్యాపారాలను నిర్వహించడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని, ట్రాఫిక్‌కు అంతరాయం తమ వ్యాపారాలను సాగించాలని సూచించారు. రహదారిపై, డ్రెయినేజీ వ్యవస్థను ఆక్రమిస్తూ ఏర్పాటు చేసిన షెడ్లను, వ్యాపార ప్రకటనల బోర్డులను వెంటనే తొలగించాలన్నారు. వ్యాపారులు తమ దుకాణాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, పాలిథిన్ బ్యాగులకు బదులు క్లాత్, పేపర్ బ్యాగులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ సదస్సులో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి ఇటికాల భాస్కర్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి దండా రాధాకృష్ణ, సభ్యులు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, మున్సిపల్ సిబ్బంది, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ ప్రసాద్

పుష్కరమైనా వెలుగు పడేలా లేదు!


ఆగిపోయిన వెలుగు భవన నిర్మాణం

- అసంపూర్తిగా వెలుగుభవన నిర్మాణం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

మణుగూరు టౌన్: డ్వాక్రా మహిళల కార్యకలాపాలకు నిర్మించతలపెట్టిన వెలుగు భవనం నిర్మాణం ప్రారంభించి అక్షరాలా 12 ఏళ్లు గడుస్తున్నా నేటికి పట్టిన గ్రహణం వీడటం లేదు. 2013లో ప్రారంభమైన పనులు చివరి దశకు వచ్చి నిలిచిపోయాయి. మున్సిపాలిటీ పరిధిలోని పాత గాంధీ బొమ్మ సెంటర్ వద్ద 2013లో డ్వాక్రా మహిళల కార్యకలాపాల నిర్వహణకు శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు చేపట్టారు. భవనంపై కప్పు గోడలు చేసి సంబంధిత కాంట్రాక్టర్ చేతులు దులుపుకోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. నాటి నుంచి నేటి వరకు ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఇదిలా ఉండగా అటు నిర్మాణం పూర్తి కాక, ఇటు ప్రారంభం కాక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వానాకాలం వచ్చిందంటే పాములు, ఎలుకలకు ఆవాసంగా మారుతుందన్నారు. పలుమార్లు డ్వాక్రా సంఘాలు భవనం పూర్తి చేయాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు సంబంధిత విన్నవించినా అవి బుట్టదాఖలయ్యాయనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి వెలుగు భవనం చుట్టు అలుముకున్న చీకట్లు తొలిగించాలని డ్వాక్రా సంఘ మహిళలు కోరుతున్నారు. భవనం నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని వేడుకుంటున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

మెప్మా భవన నిర్మాణానికి 2012–13 సంవత్సరంలో రూ.11 లక్షలు మంజూరయ్యాయి. నిధులు సరిపోక నిలిచిపోయిందని తెలిసింది. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తాం.

– ప్రసాద్, మున్సిపల్ కమిషనర్

యథేచ్ఛగా గ్రావెల్ తరలింపు

- కలివేరు గుట్టల్లో వారం నుంచి సాగుతున్న తంతు
- కేసులు నమోదు చేసినా ఆగని వైనం


కలివేరు గుట్టల్లో నుంచి గ్రావెల్‌ను తరలిస్తున్న వాహనాలు

చర్ల: మండలంలోని కలివేరు సమీపంలో గల రాజీవ్‌నగర్‌కాలనీ సమీపంలోని గుట్టల్లో నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. వారం రోజులుగా ఈ తంతు యథేచ్ఛగా కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాజీవ్‌నగర్‌కాలనీ సమీపంలో గల ప్రభుత్వ భూమిలో వారంరోజులుగా పెద్ద ఎత్తున జేసీబీలతో తవ్వి టిప్పర్లలో గ్రావెల్‌ను తరలిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అక్రమ గ్రావెల్ తవ్వకాలపై స్థానికులు ప్రశ్నిస్తే తమకు అనుమతులు ఉన్నాయంటూ అక్రమ గ్రావెల్ రవాణాదారులు బుకాయిస్తున్నారన్నారు.

కేసులు నమోదు చేసినా..

కలివేరులోని గుట్టల్లో నుంచి అక్రమ గ్రావెల్ తరలింపుపై స్థానికుల సమాచారం మేరకు రెవెన్యూ అధికారులు శనివారం రాత్రి కలివేరు గుట్టలను సందర్శించడంతో అప్పటికే రవాణాదారులు జేసీబీ, టిప్పర్లతో అక్కడి నుంచి ఉడాయించారు. ఇటీవల అనుమతులు ఉన్నాయంటూ మండలంలోని దానవాయిపేట సమీపంలో గల ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూముల్లో కూడా పెద్ద ఎత్తున అక్రమంగా గ్రావెల్ తరలిస్తుండడంతో స్థానికులు అడ్డుకుని అధికారులకు సమాచారం అందించారు. అటవీశాఖాధికారులు అక్కడకు చేరుకొని అక్రమ గ్రావెల్ తరిలిస్తున్న రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకుని అటవీశాఖ రేంజ్ కార్యాలయానికి తరలించి కేసులు నమోదు చేశారు. అధికారులు కేసు నమోదు చేసి వారం రోజులు కూడా కాకముందే మళ్లీ కలివేరు సమీపంలోని రాజీవ్‌నగర్‌లో గల ప్రభుత్వ భూమిలోని గుట్టల్లో నుంచి గ్రావెల్‌ను తరలిస్తుండడంతో స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయమై తహసీల్దార్ ఎం.శ్రీనివాస్‌ను వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ.. కలివేరు సమీపంలో గల గుట్టల్లో నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వ్యవహారంపై సమాచారం అందిన వెంటనే ఆ ప్రాంతాన్ని సందర్శించామని, అయితే అక్కడ గ్రావెల్ తవ్వి తరలించినట్లుగా ఆనవాళ్లు కనిపించాయన్నారు. గ్రావెల్ తరలించిన వాహనాలను, తరలించిన వారిని గుర్తించేందుకు యత్నిస్తున్నట్లు తెలిపారు.